జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

**కంచిలి, మే 19(వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కంచిలి ఎంపీడీవో తిరుమలరావు పేర్కొన్నారు.

ఒరియా నారాయణపురంలో మంగళవారం సిసి రోడ్డు నిర్మాణా నికి కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. నాలుగు లక్షల రూపా యల నిధులు కేటాయించి ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంతోష్, యువనేత మాదిన ప్రదీప్, కాముడు త్రినాథ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# న్యాయం చేయండి

**-బ్లాస్టింగ్‌లతో ఇళ్లలో పగుళ్లు**

**- శ్లాబ్ పెచ్చులు ఊడి ప్రమాదకరమైన పరిస్థితి ఎదుర్కొంటున్నాం**

**-తహసీల్దార్‌కు అర్చనాపురం వాసుల వినతి**

**మెళియాపుట్టి, మే 19(వార్త):** ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నాలుగవ యూనిట్ ప్రధాన కాలువ నిర్మాణ పనులలో బ్లాస్టింగ్ లు జరుగుతుండడంతో మెళియాపుట్టి మండలం పరిధిలోగల అర్చనాపురం గ్రామస్తులకు న్యాయం జరిపించాలని వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామస్తులు తహసిల్దార్ పాపారావుకు మంగళవారం నాడు అందజేశారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే తమ అర్చనాపురం గ్రామ శివారులో జరుపుతున్న బ్లాస్టింగ్‌ల కారణంగా గ్రామంలో నివాస గృహాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, బ్లాస్టింగ్ తీవ్రత వల్ల ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయనీ అలాగే స్లాబ్ నుండి పెళ్లలు ఊడి పడుతున్నాయని దీనివల్ల ఎప్పుడు, ఎక్కడ, ఎవరు, ఏ రకమైన ప్రమాదానికి గురవుతారోనని గ్రామస్తులు ప్రతి ఒక్కరూ ప్రజలు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని గ్రామస్తులుజన్ని కూర్మారావ్, జానకిరామ్ నీలకంఠం తదితరులు తీవ్ర నిస్సహాహిత వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్మాణ ప్రక్రియ వల్ల తమ ఇల్లన్ని శిథిలావస్థకు చేరుకొని నివాసయోగ్యం కాకుండా ఉన్నాయని, భూసేకరణ చట్టం-2013 ప్రకారం ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద సహాయం అందాల్సి ఉండగా, ఇప్పటివరకు ఎటువంటి పరిహారం అందలేదని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తమకు నూతన గృహాలు మంజూరు చేయాలని, జరిగిన నష్టానికి పరిహారము అందించాలని వీఆర్వో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ద్వారా వెంటనే గ్రామంలో సర్వే చూపించి నష్టాన్ని అంచనా వేయాలని, పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలను ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలగా గుర్తించి నూతన పక్కా గృహాలు మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు కాంట్రాక్టర్ నుండి మరమ్మతులకు పరిహారం ఇప్పించాలని, బాధితులకు తాత్కాలిక పునరావాసం క్రింద తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, భవిష్యత్తు కాలంలో జరిగే పనికి సంబంధించి భద్రత ప్రమాణాలు పాటించి బ్లాస్టింగ్లు జరిపించాలని వివిధ డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని వారు తహసిల్దార్ పాపారావుకు అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియకు తాము వ్యతిరేకం కాదని, కానీ మేము స్థానికంగా జీవనం కొనసాగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరు స్పందించి సమన్వయముతో వ్యవహరించి మా ఈ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని జన్ని కూర్మారావు, సవర జానకిరావు, సవర నీలకంఠం, సవర కృష్ణారావు, సవర కుమారస్వామి, సవర జయవర్ధన్, యువకులువారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.









## మందసలో విజయవంతమైన ఉచిత నేత్ర వైద్య శిబిరం



**మందస, మే 19(వార్త):** జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో.. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.మౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆఫ్తాలమిక్ రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ నేత్రాలకు సంబంధించిన అన్ని రకాల శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా జరుగుతాయన్నారు. ప్రతీ ఒక్కరు కంటి సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆఫ్తాలమిక్ లు రోణంకి వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నుంచి బి.దినేష్ కుమార్ కుమార్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 52మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 20మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపికయ్యారు. వీరిని శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఉచిత వాహన, భోజన సదుపాయశీ కల్పించడం జరిగిందన్నారు. క్యాంప్ జూనియర్ మేనేజర్ టి.రామారావు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ టి.రామారావు, మందస పీహెచ్ సీ హెల్త్ విజిటర్ టీవీ భారతి, ఫార్మసీ ఆఫీసర్, వి.శైలజ, నర్సింగ్ ఆఫీసర్ జి.ఆనంద్, ల్యాబ్ సహాయకురాలు హెచ్.సుజాత, సీనియర్ సహాయకుడు ఎం.శ్రీనివాసరావు, ఆఫీస్ సబార్డినేట్ టి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సరెండర్ లీవ్ బకాయిలు
## తక్షణమే విడుదల చేయాలి

**-స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు డిమాండ్**



**పలాస, మే 19 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 2022 నుండి చెల్లించవలసిన సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట కార్యవర్గ సభ్యులు నెమలిపురి విష్ణుమూర్తితో కలసి పలాస-కాశీబుగ్గ ఎం ఆర్ సి ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సరెండర్ లీవ్, ఎన్ క్యాష్ మెంట్ బిల్లులను చెల్లింపు చేయకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నా రని తెలిపారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. 2023 నుంచి 12వ పీఆర్సీ రావలసి ఉండగా ఇప్పటివరకు కమీషన్ ను కూడా నియ మించలేదన్నారు. వేంటనే 12వ పీఆర్సీ కమీషన్ నియమించి 30 శాతం ఐ ఆర్ ప్రకటించాలన్నారు. 2003 డిఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు, స్టాండింగ్ కమిటిలో ఆమోదం పొందిన మెడికల్ బిల్లులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బాల.. బాలికలకు కిశోరి వికాసం

**సరుబుజ్జిలి, మే 19(వార్త):** సింధువాడ సచివాలయం పరిధి బురిడివలస కాలనీలో కిషోరీ వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా కిశోరి బాల, బాలికలకు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, గృహ హింస చట్టం, విద్య హక్కు, వర కట్న నిషేధ చట్టం పై అవగాహన మరియు కిషోరి బాలికలు భద్రత, హెల్ప్ లైన్ నెంబర్స్ , పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత , గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ ఎస్. గీత గారు , సెక్టార్ సూపర్వైజర్ ఎం జానకి లక్ష్మి గారు, మహిళా సంరక్షణ కార్యదర్శి దమయంతి గారు, జిల్లా బాలల సంరక్షణ పథకం ప్రతినిధి గీతా గారు, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ సునీత సింధువాడ సచివాలయం , బురిడి వలస కాలనీ కిషోరి బాల బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు



## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



**మందస, మే 19(వార్త):** రాధాకృష్ణపురం గ్రామం సమీపంలో గల సీఐటీయు కార్యాయలం వద్ద కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీలో గల రాధాకృష్ణపురం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో సుందరయ్య జన్మించినప్పటికీ తన ఆస్తినంతటినీ పేద ప్రజల కోసం, ఉద్యమం కోసం ధారబోసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అన్నారు. సమాజంలో అణగారిన, పేద వర్గాల విముక్తి కోసమే ఆయన తన జీవితాంతం శ్రమించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం వల్ల నిత్యవసర సరుకులు ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారాల పడుతున్నాయన్నారు. ఎరువులు ధరలను పెంచడంతో రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని, రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర ఈ ప్రభుత్వాలు కల్పించడం లేదన్నారు. రైతుల భూములను అభివృద్ధి పేరుతో బలవంతంగా సేకరించి స్వదేశీ, విదేశీ బడా పెట్టుబడిదారులకు అప్పనంగా ఇస్తున్నారని ధ్వజమెత్తారు. నేటి రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్న తరుణంలో, సుందరయ్య లాంటి నాయకుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం.. పేద ప్రజల హక్కుల కోసం పోరాడటమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. భారత స్వతంత్ర సమరయోధుడు, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం బావి తరాలకు ఆదర్శం అని అన్నారు.

ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్య వర్గ సభ్యుడు కె.కేశవరావు, రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, పి. దేవేంద్ర. కె.కృష్ణారావు, మద్దు ధర్మారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతోనే పోషక నిర్వహణ సాధ్యం

**సరుబుజ్జిలి, మే 19(వార్త):** భూసార పరీక్షల ద్వారానే పంటకు అవసరమయ్యే ప్రధాన, సూక్ష్మపోషకాల స్థాయిని గుర్తించి తదనుగుణమైన పంటలు వేసి, ఎరువుల యాజమాన్యం పాటించడం వలన మేలైన దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి తవిటినాయుడు అన్నారు. మంగవారం సరుబుజ్జిలి మండలం లో స్థానిక వీరభద్రపురం గ్రామంలో బ రామకృష్ణ పొలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీమ్ లీడర్ లావణ్య మాట్లాడుతూ "ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకోవడం వలన రసాయన ఎరువులు పై అనవసర ఖర్చును తగ్గించుకోవచ్చు అని, అంతేకాకుండా అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులు వాడటం వలనఎరువులు నిరుపయోగం కాకుండా నివారించవచ్చని" అన్నారు. ఈ ఏడాది రైతుల ప్రయోజనార్థం డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల వనరుల కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, భూసార పరీక్షలు చేయించుకునే రైతులకు పరీక్ష నివేదిక ఆధారంగా భూమి చౌడు గుణం, పోషకాల శాతం, కాలుష్యాన్ని గుర్తించి దానికి అనుగుణంగా నిర్దిష్ట క్షేత్రస్థాయి పోషక నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త బి రాజు కుమార్ అన్నారు

అనంతరం అభ్యుదయ రైతు పొలంలో మట్టి నమూనా సేకరించే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠ్య పుస్తకాలు అమ్మితే తాట తీస్తా

**- మండల విద్యాశాఖాధికారి సి.హెచ్.శ్రీనివాస్**



**పలాస, మే 19 (వార్త):** పాఠ్య పుస్తకాలు అమ్మితే తాటతీస్తామని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ప్రయివేటు పాఠశాలల హవా గట్టిగానే వీస్తోందని, సందు సందునా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుండి అధికమొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తుండడమే కాకుండా విద్యాలయాలను వ్యాపారకేంద్రాలుగా మార్చి పుస్తకాల రూపంలో అధిక ధరలకు అమ్మకాలు జరుపుతూ ముక్కు పిండి వసూలు చేస్తూ ధనార్జన చేసుకుంటున్నారని, పుస్తకాలు తప్పనిసరిగా తమవద్దే కొనాలన్న ఆంక్షలు విధిస్తున్నాయన్న విమర్శలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నయి. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రభుత్వ పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరంకుగాను విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో నిబంధనలను ఉల్లంఘించి తమ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు లాంటివాటిని అమ్ముతున్నారనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. రీసెంట్గా ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో పుస్తకాలు అమ్ముతు న్నారన్న ఫిర్యాదు వచ్చిన కారణంగా సదరు విద్యాసంస్థలో ఆకస్మిక తనిఖీలు చేసి షోకాజ్ నోటీసులందించామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సూచనల మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రయివేటు విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫారా లతోపాటు ఏవైనా విక్రయాలు జరిపితే అటువంటి విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేసేందుకు వెనుకాడబోమని ఈసందర్భంగా ఎం.ఈ.ఓ శ్రీనివాస్ హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగంలో కేశఖండన శాల నిర్మించాలి

**జలుమూరు, మే 19 (వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో కేశఖండనశాల నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో ప్రత్యేక కేశఖండనశాల లేకపోవడంతో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు అరుగులపై కూర్చుని తలనీలాలు సమర్పించుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ముఖ్యంగా మహాశివరాత్రి, కార్తీక మాసాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో నదీ తీరంలోని ఇసుక దిబ్బలపై కూడా మొక్కులు తీర్చుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలతో కూడిన కేశఖండనశాల నిర్మిస్తే పరిశుభ్రతతో పాటు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయ అభివృద్ధిలో భాగంగా కేశఖండనశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# జవాన్‌కు సైనిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

**-మృతుడు అనకాపల్లి జిల్లావాసి**

**-కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు**



**మందస, మే 19(వార్త):** విధులకు వెళ్తున్న ఆర్మీ జవాను ప్రమాదవశాత్తూ మరణించారు. గుర్తు తెలియని వ్యక్తిగా భావించినప్పటికీ, అనంతరం మరణించిన వ్యక్తి ఆర్మీ జవానుగా గుర్తించారు. భరతమాత సేవలో తరించిన ఆ జవాను అర్థాంతరంగా మరణించం పట్ల సైనికులు కూడా విచారం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం రేగులపాలేం గ్రామానికి చెందిన రాజాన లక్ష్మణరావు అనే ఆర్మీ జవాను గుహటిలోని సిగ్నల్ రెజిమెంట్ 11వ వైర్ లెస్ యూనిట్‌లో పని చేస్తున్నారు. సొంత గ్రామం రేగులపాలేం వచ్చిన లక్ష్మణరావు తిరిగి గుహటి వెళుతుండగా, సోమవారం రాత్రి ప్రమాదశాత్తూ రైలు నుంచి జారి మరణించారు. పలాస రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతుని గుర్తించారు. కుటుంబీకులు సమాచారం అందించారు. లక్ష్మణరావు భౌతికదేహాన్ని మందస మండలంలోని హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మంగళవారం ఉదయం లక్ష్మణరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హరిపురం చేరుకున్నారు. ఈలోగా.. గుహటి సిగ్నల్ రెజిమెంట్ 11వైర్ లెస్ యూనిట్ నుంచి ఆర్మీ అధికారి కమలహాసన్, విశాఖపట్నం స్టేషన్ యూనిట్ హెడ్ క్వార్టర్ నుంచి నుంచి రామక్రిష్ణ, పలాస-కాశీబుగ్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు, సంఘం నాయకులు కె.నారాయణరావు, కె.విశ్వనాథం, భావన పురుషోత్తం హరిపురం సీహెచ్ సీకు చేరుకున్నారు. లక్ష్మణరావు భౌతికదేహానికి సైనిక లాంఛనాల అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. లక్ష్మణరావు మృతదేహాన్ని చూసి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రేగులపాలేం గ్రామస్తులు కూడా కన్నీటి పర్యవంతమయ్యారు.

# సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం





**పలాస, మే 19(వార్త):** పేదల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను మనమందరం కొనసాగించేందుకు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సభ పలాస మండలం మాకన్నపల్లి సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాకన్నపల్లిలో జరిగిన సభకు సిపిఎం నాయకులు టి అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం నాయకులు యన్ గణపతి, మాకన్నపల్లి మాజీ సర్పంచ్ సైని దేశయ్య, ప్రముఖ రచయిత కుత్తుమ్ వినోద్ కుమార్, మాజీ సైనిక ఉద్యోగులు సంఘం ప్రతినిధి కె లింగమూర్తి, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఆర్ చిన్నారావు, రాపాక ముసలయ్య, కుత్తుమ్ ధర్మారావు, తెప్పలరాజు, తదితరులు మాట్లాడుతూ నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవ కలిగిన పేద ప్రజలకె జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేద, అనగారిన వర్గ ప్రజలు కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ దోపిడీ పద్ధతులు మార్చేసి పేదలను మరింత పేదలుగా చేస్తున్నారని అన్నారు. ఆకాశాన్ని అంటుతున్న ధరలు ఒకవైపు ఉపాధి లేక మరో వైపు ప్రజలు అల్లాడుతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న ఈ పాలకుల కుటిల నీతిని ప్రజలు ప్రశ్నించాలని, బలమైన ప్రజా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. పీడిత ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని ప్రసాధరావు, దుర్గరావు, సైని జాన్సీ, తెప్పల మోహిని, బొకర మిస్సమ్మ, జుత్తు లోకానాదం తెప్పల షణ్ముఖ,కళాకారులు ఆర్ చిరంజీవులు, పి జోగారావు డి లక్ష్మణ, యన్ ఢిల్లేశ్వరి, యం లావణ్య, జె భాగ్యలక్ష్మి, రజని,జి జ్యోతి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు రూ.2 లక్షల సాయం




**నరసన్నపేట, మే 19(వార్త):** ఇటీవల నరసన్నపేట పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి స్థానికులు గొర్లె జ్యోతి, సింహాద్రి భాస్కర్‌రావు తమ అనారోగ్య సమస్యలను విన్నవించుకున్నారు. తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరగా సీఎం వెంటనే స్పందించి అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నరసన్నపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు చెరో రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే స్పందించే నాయకత్వం సీఎం చంద్రబాబు నాయుడుదని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు అని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. సాధారణ ప్రజల కష్టాలను గుర్తించి తక్షణ సహాయం అందించడం సీఎం మానవత్వానికి నిదర్శనమన్నారు. ఆర్థిక సహాయం అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, వార్డు సభ్యుడు బోయిన సతీష్, పిఏసిఎస్ డైరెక్టర్ సరిపల్లి మధు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బెవర శివకుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రావాడ గణపతిరావు, నియోజకవర్గ తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షుడు మెండ గౌరి నాయుడు, తహశీల్దార్, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఘనంగా సోమ పోలమ్మ సంబరం



**సోంపేట, మే 19(వార్త):** సోంపేటలో వెలసిన చీకటి సోమ పోలమ్మ తల్లి సంబర మహోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. దేవర వీధికి చెందిన రావాడ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవం సాయంత్రం నాలుగు గంటల మొదలు రాత్రి 9 గంటల వరకు పలు వీధుల గుండా ఊరేగింపుతో అమ్మవారి గజముద్దతో కాళికా వేషాధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో బాణాసంచా కాల్పులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వైసిపి ఇచ్చాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, వైసిపి నాయకులు ఇప్పిలి కృష్ణారావు తడక జోగారావు సోంపేట కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాస్ రెడ్డి, కొనపల సురేష్, పొడుగు కామేష్ నర్తు శివాజీ తదితరులు హాజరయ్యారు.

## సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



**కవిటి, మే 19(వార్త):** రాజపురం సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన సనపల జానకి రావు కుటుంబాన్ని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి తో పాటు పలువురు వైసీపీ నాయకులు మంగళవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంచి వ్యక్తిత్వం కలిగిన జానకిరావు మృతి చెందడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. కంచిలి మండలం దొలసాయి గ్రామస్తుడు వైసీపీ సభ్యుడు జయసేన దోలాయ్ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వజ్జ మృత్యుంజయ, తలగనా తిరుపతి, కొనపల సురేష్,గోనప సింహాచలం, భయ్యా గోమాంగో తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ ధరలపై రాజకీయం తగదు



**ఇచ్ఛాపురం, మే 19 (వార్త):** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై వైసీపీ నాయకులు చేస్తున్న నిరసనలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఇచ్ఛాపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ విమర్శించారు. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం వల్ల దేశవ్యాప్తంగా ఇంధన ధరలపై ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పకుండా వైసీపీ నాయకులు రాజకీయ డ్రామాలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ పెంపులతో ప్రజలపై అదనపు భారం మోపిందని జైదేవ్ గుర్తు చేశారు. వైసీపీ పాలనలోనే సుమారు 40రూ. వరకు ధర అదనంగా పెరిగిందని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా స్వల్పంగా రూ.3--4 మార్పులు వచ్చినా... ప్రజల్లో భయాలు సృష్టిస్తూ రాజకీయ నిరసనలు చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిస్తున్న ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన సమయంలో వైసీపీ నాయకులు రాజకీయ లాభాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని... ఎవరు నిజంగా ప్రజల కోసం పని చేస్తున్నారో, ఎవరు కేవలం రాజకీయ డ్రామాలు చేస్తున్నారో ప్రజలకు స్పష్టంగా తెలుసని జైదేవ్ పేర్కొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**-కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి**

**పలాస, మే 19 (వార్త):** ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం పద్మనాభపురం గ్రామాన్ని సందర్శించారు. పద్మనాభపురం గ్రామం సందర్శించి, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్‌లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వమని తెలియజేశారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, అమొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



